క్లుప్తంగా

ఎ.కోడూరు
దుర్గమ్మ సన్నిధిలో బూడి



దుర్గమ్మను దర్శించుకుని పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

కె. కోటపాడు : మండలంలో ఎ.కోడూరు గ్రామంలో ప్రతిష్టించిన దుర్గమ్మను జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు సతీసమేతంగా బుధవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఐక్యతతో గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించుకోవడం ముదావహమన్నారు. ఆయన వెంట గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొడ్డు ప్రకాశ్, ఎంపీటీసీ సభ్యులు లెక్కల గౌతమి, నాయకుడు లెక్కల శంకరరావు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ బాధ్యతల స్వీకారం



తహసీల్దార్ వేణుగోపాల్

నాతవరం : తహసీల్దార్‌గా ఎ.వేణుగోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎస్.ఎస్.వి శ్రీనివాస్‌నాయుడును అనకాపల్లి కలెక్టరు కార్యాలయానికి బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వేణుగోపాల్ ప్రజా సమస్యలతో పాటు రెవెన్యూ సమస్యలను నిబంధనల మేరకు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిప్యూటీ తహసీల్దార్ టి.వి.ఎల్.రాజు, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీవోను సత్కరించిన ఎంపీపీ రాజారామ్



ఎంపీడీవో అప్పారావును సత్కరిస్తున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల : మాడుగుల ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కొంకి అప్పారావును ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్ దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండలం అభివృద్ధికి తనవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ ఎల్ల కళావతి, ఎంపీటీసీలు విజయలక్ష్మి, మహేశ్వరి, కోఆప్షన్ మెంబర్ షేక్ ఉన్నీషా పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ



సీఐ మధు

గొలుగొండ : గొలుగొండ ఎక్సైజ్‌శాఖ సీఐగా మధు బుధవారం విధుల్లో చేరారు. గతంలో పనిచేసిన రాజారావు బదిలీ కావడంతో కొత్తగా మధు ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాతవరం, గొలుగొండ ప్రాంతాల్లో గంజాయి, నాటుసారా, మద్యం అక్రమ అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికల పాఠశాల కుక్ పోస్టుకు దరఖాస్తులు

రోలుగుంట : జె.నాయుడుపాలెం బాలికల పాఠశాల (టైపు–4 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం)లో అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఈ నెల 15 తేదీలోపు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని మండల విద్యాశాఖాధికారి–2 జగ్గారావు ఓ ప్రకటనలో కోరారు. అభ్యర్థి స్థానికులై ఉండి లోకల్ స్టేటస్ ఆధార్ కార్డులో ఉన్న సమాచారం ప్రాప్తి మేరకే నిర్ణయం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు తేదీ నాటికి వయసు 42 సంవత్సరాలుండాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు వయోపరిమితి 47 ఏళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు 52 ఏళ్లు ఉండాలని తెలిపారు.

ఖరీఫ్ వరి...తెగుళ్లతో వర్రీ

- అధిక వర్షాలతో పంటకు బీడపీడలు
- మండలంలో 150 ఎకరాల్లో పాసి తెగులు
- సాగు రైతుల్లో ఆందోళన
- సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారుల సూచనలు



కొవ్వూరులో రైతులకు సస్యరక్షణ సూచనలు చేస్తున్న ఏవో విజయలక్ష్మి



ఎ.భీమవరంలో పంటకు హెక్సాకొనజోల్‌ను పిచికారి చేస్తున్న రైతు

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో ఖరీఫ్ సాగులో ఉన్న వరి పంటకు ప్రధానంగా పాసి తెగులు సోకుతుందని సాగు రైతులు చెబుతున్నారు. వరి పంట నాట్లు పూర్తయిన నెల రోజుల కాలంలో ఇటు సాధారణ వర్షాలు, అటు తుపాను కారణంగా కురిసిన వర్షాలకు తోడు వాతావరణం మబ్బులతో ఉన్నప్పుడు పంటకు పాసి తెగులు ఆశించే పరిస్థితి ఉంది. ఈ తెగులు పంటకు సోకడం వల్ల పంట ఎర్రబారి కిందికి పడిపోతుంది. తద్వారా పంట పొట్ట దశలో ఉన్న సమయంలో తెగులు సోకడం గింజ కట్టే శాతం తగ్గడంతో పాటు పంట పొల్ల బారే పరిస్థితి ఉంటుందని సాగు రైతులు పేర్కొంటున్నారు. తెగుళ్ల కారణంగా ఈ ఖరీఫ్‌లో దిగుబడులపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు.

సుమారు 150 ఎకరాల్లో తెగులు గుర్తింపు

మండలంలో ముందుగా వరినాట్లు వేసిన పల్లపు ప్రాంత గ్రామాలైన ఎ.భీమవరం, పొడుగుపాలెం, డి.అగ్రహారం, గవరపాలెం, మేడిచర్ల, గొండుపాలెం, పైడంపేట, చౌడువాడ, రొంగలినాయుడుపాలెం తదితర గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో సాగులో ఉన్న వరి పంటకు పాసి తెగులు ఆశించి ఉంటుందని సాగు రైతులు తెలుపుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులతో పాటు వర్షాలు ఎక్కువగా పడడం వల్ల పొలంలో నిల్వ నీరు ఎక్కువగా ఉంటే పాసి తెగులు పంటకు ఆశించే పరిస్థితి ఉంది.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది...

మాడుగుల రూరల్ : మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం తాటిపర్తి శివారు కాశీపురం, శంకరం, గ్రామాల్లో రైతులకు ఏవో వాసుదేవరావు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

రోలుగుంట : కొవ్వూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి రైతుల పొలాలు సందర్శించి వరి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు తెలియజేశారు. ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలిపారు. రైతుల పొలాల్లో గుర్తించిన సుడిదోమ, పాముపొడ తెగుళ్ల నివారణపై సూచనలు చేశారు. ఉద్యానవన శాస్త్రవేత్త సత్తిబాబు జీడి, జామ, వంకాయ, టమాటా, మిరప నారు రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ రైతులు పాల్గొన్నారు.

సస్య రక్షణ చర్యలు పాటించాలి



పాసి తెగులు నివారణకు రైతులు పొలంలో రెండేసి మీటర్ల దూరంలో తూర్పు నుండి పడమరకు కాలిబాటలను ఏర్పాటు చేయాలి. తద్వారా పంటకు గాలి, వెలుతురు తగలడంతో పాటు పంటకు ఆశించే పురుగుకు సూర్యరశ్మి తగలడం వల్ల నశించే పరిస్థితి ఉంటుంది. వీటితో పాటు పాసి తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 ఎంఎల్ మిశ్రమాన్ని లీటర్ నీటిలో కలిసి ఎకరా పొలానికి పిచికారి చేస్తే పాసి తెగులు సమస్య నుంచి పంటను రక్షించవచ్చు. –లైలాదేవి, మండల వ్యవసాయ విస్తరణాధికారి, కె.కోటపాడు

తాగునీటి కనెక్షన్లలో వివక్ష

- నాయీబ్రాహ్మణులు, రజకుల పట్ల స్థానిక టీడీపీ నేతల చిన్నచూపు
- మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా వేధింపులు
- టీడీపీ నేతలు ఒప్పుకుంటేనే కనెక్షన్లు ఇస్తామంటున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



నాగయ్యపేటలో వేసిన పైపులైన్‌ను చూపిస్తున్న బాధిత మహిళలు



సీతంపేట ట్యాంక్ పైపులైన్‌కు కలపకుండా ఉంచిన నాయీబ్రాహ్మణుల నీటి పైపు

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట పంచాయితీ పరిధిలో తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా స్థానిక టీడీపీ నేతలు అడ్డగించి నీచ రాజకీయాలకు తెరలేపారు. నాగయ్యపేటలోని పాల సమీకరణ కేంద్రం వెనుక భాగంలోని కల్లాల్లో నివాసం ఉంటున్న నాయీ బ్రాహ్మణులు, రజకులకు మంచినీటి పైపు లైన్ వేసినప్పటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వకుండా స్థానిక సర్పంచ్ సహా టీడీపీ నేతలు అడ్డు తగులుతున్నారు. దీంతో 10 కుటుంబాలకు నెలల తరబడి తాగు నీరు దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వేసిన పైపులైన్ సీతంపేటకు చెందింది కావడంతో నాగయ్యపేట వాసులకు కుళాయి కనెక్షన్ల ఇవ్వడం కుదరదని స్థానిక టీడీపీ నేతలు వాదిస్తున్నారు. ఇదే వాస్తవమైతే పైపులైన్ ఎందుకేశారని బాధిత మహిళలు కాత చినమ్మలు, సంధ్య, లక్ష్మి, రమాదేవి, కాత లక్ష్మి, మామిడి మహాలక్ష్మితో పాటు స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు వంటాకు పైడితల్లమ్మ ప్రశ్నిస్తున్నారు. ఇదే సీతంపేట పైపులైన్ నుంచి నాగయ్యపేటకు చెందిన సుమారు 40 కుటుంబాలకు పైగా కుళాయి కనెక్షన్లు ఎలా ఇచ్చారని బాధిత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ పట్ల వివక్ష చూపడం దారుణమని మండిపడ్డారు. అగ్రకులాలకు ఒక న్యాయం, బలహీనవర్గాలకు ఒక న్యాయమా? అని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు స్థానిక ప్రజాప్రతినిధులను, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని బాధిత మహిళలు తెలిపారు. కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్‌ను కోరగా స్థానిక టీడీపీ నేతలు ఒప్పుకుంటేనే వేస్తానని చెప్పడం అత్యంత దారుణమన్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అధికారుల తీరు సరికా దన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు కుళాయి నీటిని అందించాలని కోరుతున్నారు.

చిన్నారులతో పని చేయించడం నేరం

నాతవరం : చిన్నారులతో వెట్టి చాకిరీ చేయించుకోవడం కార్మిక చట్ట ప్రకారం నేరమని నర్సీపట్నం డివిజన్ కార్మిక శాఖ సహాయ అధికారి రామచంద్ర అన్నారు. బుధవారం కార్మికశాఖ ఐసీడీఎస్ శాఖ సంయుక్తంగా బాల కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకోవడంపై నేరమని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేకంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. కార్మిక శాఖ అధికారులు, పోలీసులు నాతవరంలో పలు షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ నాతవరం సూపర్‌వైజరు విజయలక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలు వసంత, వరలక్ష్మి, సత్యవతి, రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎట్టకేలకు నూతన సచివాలయంలోకి..



దేవరాపల్లి సచివాలయం-2లో విధులు నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది



వినియోగంలోకి వచ్చిన దేవరాపల్లి సచివాలయం-2 నూతన భవనం

సాక్షి ఎఫెక్ట్..

దేవరాపల్లి: దేవరాపల్లి సచివాలయం–2 నూతన భవనంలోకి ఎట్టకేలకు సిబ్బంది అడుగు పెట్టారు. సుమారు రూ. 40 లక్షలతో సచివాలయం–2 భవనం నిర్మాణ పనులు పూర్తయి ప్రారంభోత్సవం సైతం చేసి దాదాపుగా 9 నెలలు గడుస్తున్నా సిబ్బంది అడుగు పెట్టలేదు. గ్రామ శివారులో శిథిలావస్థలో ఉన్న కల్యాణ మండపంలోని విధులు నిర్వర్తిస్తూ కాలపాయన సాగిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. ఈ సమస్యపై సాక్షిలో గత నెల 30న 'సొంత గూటికి ఇంకెప్పుడు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తక్షణమే నూతన భవనంలోకి ప్రవేశించాలని ఉన్నతాధికారుల ఆదేశాలతో సిబ్బంది అడుగుపెట్టి విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలందరికీ చేరువలో ఉన్న నూతన సచివాలయంలో సిబ్బంది సేవలందించేలా కృషి చేసిన సాక్షికి స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

నాతవరం : మారుమూల గ్రామాలు సైతం అన్ని వర్గాల ప్రజలకు భగవద్గీత గురించి ప్రచారం చేయడమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ ఉపాధ్యక్షుడు బి.శాంతరాజు అన్నారు. బుధవారం నాతవరం, చెర్లోపాలెం, వెంకయ్యపాలెం, జిల్లేడుపూడి, తాండవ జంక్షన్, డి.యర్రవరం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేసి ఆయా ప్రతులను పంపిణీ చేశారు. దసరా పండగ సందర్భంగా భగవద్గీతపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు బ్రహ్మ విద్యలో మనిషి పట్టు సాధించవలసి ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డి.ఎస్.ఎన్.మూర్తి, స్వామినాయుడు బి.సత్యవతి, శోభారాణి, శాంతాదేవి పాల్గొన్నారు.

11 వరకు మద్యం షాపుల దరఖాస్తు గడువు

మాడుగుల రూరల్ : మద్యం షాపుల కోసం నిర్దేశించిన దరఖాస్తుల సమర్పణ గడువును ఈ నెల 11 వరకు పొడిగించారని మాడుగుల ఎక్సైజ్ సీఐ సిహెచ్.వి.ఎస్. ప్రసాదు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అబ్కారీ శాఖ సంచాలకులు నిషాంత్‌కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తులను ఈ నెల 12, 13, తేదీల్లో దరఖాస్తులు పరిశీలన పూర్తి చేసి, 14వ తేదీన ఆయా జిల్లాలో కలెక్టర్ పర్యవేక్షణలో మద్యం షాపులు కోసం లాటరీ తీస్తారని వివరించారు. అదే రోజు కేటాయింపు వక్రియను పూర్తి చేస్తామని ఈ నెల 16వ తేదీ నుంచి నూతన మద్యం విధానం అనుసరించి ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయన్నారు.

బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు

మాకవరపాలెం : టైప్–4 కేజీబీవీ పాఠశాలలో బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈవో మూర్తి బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో త్వరలో ప్రారంభం కానున్న బాలికల వసతి గృహం (టైప్–4 కేజీబీవీ) పాఠశాలలో పనిచేసేందుకు హెడ్ కుక్–1, అసిస్టెంట్ కుక్–1, చౌకీదార్–1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 15లోగా దరఖాస్తులను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

పాఠశాల భవనం పూర్తి చేయాలి

రోలుగుంట : అర్ల గిరిజన పంచాయతీ శివారు గడబపాలెం గ్రామంలో సుమారు దశాబ్దకాలంగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని కోరుతూ స్థానికులు కోరుతున్నారు. ఈ గ్రామానికి 2013–14లో పాఠశాల మంజూరైంది. ఇకడ పాఠశాల భవన నిర్మాణం కోసం సర్వశిక్షా అభియాన్ పథకం కింద రూ.16 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో పునాదుల నిర్మాణం చేపట్టి సగంలో ఆపేశారు.

అన్న సమారాధనలు



ఏకోడూరులో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మాడుగుల : మాడుగుల దేవీ ఆలయంలో బుధవారం స్థానిక సీనియర్ న్యాయవాది శ్రీనాదు ప్రసాద్ ఆర్థిక సహకారంతో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామంలో శరనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చద్ది (అన్నసమారాధన) ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో గ్రామస్తులు చద్ది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కె.కోటపాడు : ఎ.కోడూరులో దేవీ ఆలయం వద్ద బుధవారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. . ఎ.కోడూరుతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో భక్తులకు బొడ్డు ప్రకాశ్, ఎంపీటీసీ గౌతమి, బొడ్డు శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వడ్డన చేశారు.

విధి నిర్వహణలో మీ అంకితభావం అభినందనీయం

బదిలీ అయిన అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఎ.కొత్తపల్లిలో కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ



రైవాడలో కార్యదర్శి లక్ష్మి, వీఆర్వో రమణమ్మను సత్కరిస్తున్న సర్పంచ్ చల్లా లక్ష్మి తదితరులు

దేవరాపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసే అధికారులకు ప్రజా మన్ననలు ఎల్లప్పుడూ ఉంటాయని స్థానిక ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అన్నారు. ఈ మేరకు ఎ.కొత్తపల్లి పంచాయతీ కార్యదర్శి టి. పవన్, సచివాలయ కార్యదర్శి కె.కొండలరావు, వీఆర్వో దేముడమ్మ, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శి లక్ష్మికి స్థానిక సర్పంచ్ ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగావారిని ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. రైవాడ పంచాయతీలో బదిలీ అయిన కార్యదర్శి టి.లక్ష్మిని స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. రైవాడ వీఆర్వోగా బదిలీపై వచ్చిన యు.రమణమ్మను సత్కరించి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో చల్లా నాయుడు తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చదువుల తల్లికి వందనం



చోడవరంలో సరస్వతీదేవి అలంకరణలో దుర్గమ్మ వారు



ఎ.కోడూరులో సరస్వతీదేవి మందిరంలో..



విజయరామరాజుపేటలో 50 కేజీల లడ్డూతో భక్తుడు

నర్సీపట్నం : పట్టణంలో ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఏడవ రోజైన బుధవారం అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెదబొడ్డేపల్లి జ్ఞాన సరస్వతీ ఆలయంలో అక్షరభ్యాసాలు నిర్వహించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

కె.కోటపాడు : ఎ.కోడూరు హైస్కూల్లో గల సరస్వతీ దేవి అమ్మవారి మందిరంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి మూల నక్షత్రం రోజున సరస్వతీ దేవి మందిరంలో ప్రతి ఏటా సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహిస్తారు. ఉపాధ్యాయుడు బంగారునాయుడు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సరస్వతీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ

మాడుగుల రూరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున గల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా ఆలంకరించి పూజలు జరిపారు. గురువారం ఆలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు దండి నర్సింగరావు తెలిపారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, కళావేదిక మీద ప్రతిష్టించిన అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

సంతోషిమాత ఆలయంలో ...

గొలుగొండ: ఏఎల్‌పురం గ్రామంలో ఉన్న సంతోషి మాత ఆలయంలో బుధవారం సుమారు 50 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

బుచ్చెయ్యపేట : దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడోరోజు సీతయ్యపేట ఆలయంలో ఉన్న దుర్గామల్లేశ్వర్ల అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. సీతయ్యపేట,బుచ్చెయ్యపేట,లోపూడి,వడ్డాది,రాజాం,తురకలపూడి,దిబ్బిడి,గున్నెంపూడి గ్రామాల్లో మండపాల వద్ద సరస్వతిదేవిగా అమ్మవారిని అలంకరించి లలిత సహస్రములు, దేవి ఖడ్గమాల స్తోత్రాలతో కుంకుమార్చనలు నిర్వహించారు. విద్యార్థులతో సరస్వతీ పూజలు చేయించారు. విజయరామరాజుపేటలో కోఆపరేటివ్ మాజీ అధ్యక్షుడు గోవింద 50 కేజీల లడ్డూతో ఊరేగింపుగా వెళ్లి దుర్గమ్మకు బహూకరించారు.

మాడుగుల : స్థానిక జీసీసీ గొడౌన్ వద్ద వెలసిన దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో దుర్గాలమ్మ బుధవారం సరస్వతీదేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో విద్యార్థులు సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. వారికి ఉచితంగా పుస్తకాలు, పెన్నులు ఆలయ కమిటీ అందజేసింది. నవరవీధిలో వెలసిన పోలిపల్లమ్మ అమ్మవారిని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించారు. అక్షరాభ్యాసాలు నిర్వహించారు.

చోడవరం : చోడవరం పాతబస్టాండ్ దగ్గర వేంచేసియున్న దుర్గాదేవి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. వీణ, పెన్నులు, పుస్తకాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేసి, పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. వెంకన్నపాలెం గ్రామంలో నెలకొల్పిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి వద్ద భక్తులు అగ్నిగుండం తొక్కి మొక్కులు చెల్లించారు. గోవాడలో కూడా నిప్పుల గుండాలు తొక్కి భక్తులు మొక్కులు చెల్లించారు.

నూతన పంచాయతీ కార్యదర్శులు బాధ్యతల స్వీకారం

మాడుగుల రూరల్ : సాధారణ బదిలీల్లో భాగంగా, మండలంలో పలు గ్రామ సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారు. ఎ.వీరనారాయణం పంచాయతీ కార్యదర్శిగా, అల్లూరి జిల్లా హుకుంపేట మండలం కుట్నాపల్లి నుంచి పి.సుధారాణి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పోతనపూడి పంచాయతీ కార్యదర్శిగా అరకు నుంచి జె.కిరణ్‌కుమార్ వచ్చి బాధ్యతలు చేపట్టారు. తాటిపర్తి పంచాయతీ కార్యదర్శిగా వేచలం పంచాయతీ నుంచి బదిలీపై వచ్చిన కె. చంద్రకళ విధుల్లో చేరారు. జేడీపేట పంచాయతీకి కలిగోట్ల పంచాయతీ నుంచి జాజిమొగ్గల ప్రసాదు, జంపెన పంచాయితీకి పాడేరు నుంచి ఎస్.నతానీల్, సాగరం పంచాయతీకి నాతవరం నుంచి షేక్ హుస్సేన్, జి.అగ్రహారానికి సబ్బవరం నుంచి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు. మాడుగుల పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా చోడవరం పంచాయతీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన ఎ.శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు.

జీడిపిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మాడుగుల : జీడిపిక్కలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న అన్నారు. బుధవారం తాటిపర్తి పంచాయతీలో గిరిజన రైతులు చేపట్టిన నిరసనలో పాల్గొని మాట్లాడారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, ఈ క్రాప్ నమోదు చేయాలని, రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మాడుగుల, చీడికాడ, రావికమతం, రోలుగుంట, నర్సీపట్నం, గోలుగొండ, నాతవరం, కోటఉరట్ల , రోలుగుంట మండలాల్లో సుమారు లక్ష ఎకరాల్లో జీడితోటలు సాగవుతున్నాయన్నారు. నిరసనలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి గిరిజన రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగు విధానంలో కూరగాయలు పండించాలి

కె.కోటపాడు : ప్రకృతి సాగు విధానంలో కూరగాయలను పండించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి కె.శచీదేవి అన్నారు. కె.సంతపాలెం, ఆర్లి గ్రామాల్లో కూరగాయల సాగు రైతులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూరగాయలు సాగు చేసే సమయంలో పంటలకు రక్షణగా షేడ్ నెట్‌ను ఉపయోగించాలని తెలిపారు. ప్రకృతి సాగు విధానంలో పండించే కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేలా డీఆర్‌డీఏ ద్వారా సహకారం అందిస్తామన్నారు.

కేజీబీవీలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల : స్థానిక కేజీబీవీలో ఖాళీలు భర్తీ చేయడానికి దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ఎస్‌వో విజయ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ సాయంకాలం 5 గంటలలోపు మాడుగుల ఎంఈవో కార్యాలయానికి దరఖాస్తు అందజేయాలన్నారు. నైట్ వాచ్‌మన్ ఉమన్, -1, స్కావెంజర్ -1 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు జూలై ,1, 2024 నాటికి 42 సంవత్సరాలు దాటి ఉండరాదన్నారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌వో కోరారు.